

## స్వదేశాగమన శుభాకాంక్షలు

ఆస్ట్రేలియా పర్యటనను దిగ్విజయంగా పూర్తి చేసుకొని హనుమకొండ నగరానికి విచ్చేసిన మా పిన్ని, బాబాయ్ తౌటం భాగ్యలక్ష్మి–దయాకర్ దంపతులకు తౌటం సంతోష్, సతీష్, సందీప్, శ్రవణ్, సాయి కిరణ్, గుండు స్రవంతి, నగేష్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. వారు ఆయురారోగ్యాలతో కళకాలం జీవించాలని అభిలషించారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 67
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
నవంబర్ 27, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి అప్పుడే ప్రభుత్వాలకు మనుగడ

- ఓయూ సోషల్ సైన్స్ మాజీ డీన్ కె.శ్రీనివాసులు
- రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేయూలో జాతీయ సదస్సు



8లో..

## వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సురేఖ

- జీఎంఆర్ అరీనా కళ్యాణ వేదికగా వివాహ మహోత్సవం



8లో..

## మాదకద్రవ్యాల నిరోధానికి కృషి

- విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద



8లో..

## బ్యాలెట్ ఓటింగ్ పిల్ కొట్టేసిన సుప్రీంకోర్టు

- ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య

వివరాలు 2లో..



# మూడేళ్లుగా.. చిమ్మ చీకటిలోనే..!



- శ్రీ గోవింద లక్ష్మీనారాయణ ఆలయంలో పవర్ కట్
- పురాతన ఆలయంపై పాలకుల నిర్లక్ష్యం
- అటువైపు కన్నెత్తి చూడని దేవాదాయ శాఖ
- జైనుల ఆరాధ్య దైవంగా ఏడాది పాటు పూజలు
- గోవింద రాజుల స్వామి ఆభరణాలు ఇక్కడే ఉన్నాయంటూ ప్రచారం

ఓరుగల్లు పట్టణంలో 11వ శతాబ్దంలో నిర్మించినట్లుగా చెబుతున్న చారిత్రక ప్రసిద్ధిగాంచిన గోవిందరాజుల గుట్టపై స్వయంభుగా వెలసిన గోవిందరాజస్వామికి అనుబంధంగా ఏర్పాటు చేసిన శ్రీ గోవింద లక్ష్మీనారాయణ ఆలయంపై ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తోంది. ఎంతో ఎత్తులో ఉన్న గోవిందరాజుల గుట్టను ఎక్కలేని వృద్ధులు, ఇతర భక్తుల దర్శనార్థం గోవిందరాజుల గుట్టకు కూతవేటు దూరంలోనే శ్రీ గోవింద లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఉన్నప్పటికీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో స్వామివారి ప్రాశస్త్యం దెబ్బతింటోంది. గత మూడు సంవత్సరాలుగా ఆలయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో చిమ్మ చీకటిలోనే స్వామివారు ఉంటున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు దేవాదాయ శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదంటున్నారు. అయితే గోవింద రాజుల స్వామికి చెందిన విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఈ ఆలయంలోనే భద్రపరిచినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. అదే విధంగా ఆలయ ప్రాంగణంలోని పురాతన నిర్మాణాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతోపాటు కొన్ని కూలిపోయి కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయ పునరుద్ధరణతోపాటు విద్యుత్ సరఫరాను కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ










- **శ్రీ గోవింద లక్ష్మీనారాయణ ఆలయంలో పవర్ కట్**
- **పురాతన ఆలయంపై పాలకుల నిర్లక్ష్యం**
- **అటువైపు కన్నెత్తి చూడని దేవాదాయ శాఖ**
- **జైనుల ఆరాధ్య దైవంగా ఏడాది పాటు పూజలు**
- **గోవింద రాజుల స్వామి ఆభరణాలు ఇక్కడే ఉన్నాయంటూ ప్రచారం**

# మూడేళ్లుగా.. చిమ్మచీకటిలోనే..!

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఓరుగల్లు పట్టణంలోని గోవిందరాజుల గుట్ట ఒక చారిత్రక ప్రదేశం. ఆ గుట్టపై శయన భంగిమలో ఉన్న గోవిందరాజస్వామితో పాటు ఆదిశేషుడు, నారదుడు, శ్రీదేవి, భూదేవి, నీలాదేవి కూడా కనిపిస్తారు. అయితే స్వయంభుగా వెలసిన శ్రీ గోవిందరాజ స్వామి ఆలయాలు దక్షిణ భారతదేశంలో రెండే ఉన్నాయి. అందులో ఒకటి తిరుపతి, మరొకటి వరంగల్ లోనే ఉంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడి సోదరుడే గోవిందరాజుల స్వామిగా భక్తులు భావిస్తుంటారు. ఓరుగల్లును పాలించిన కాకతీయ రాజులు తమ సామ్రాజ్య విస్తరణతోపాటు ఆయా ప్రాంతాల్లో శివాలయాలను నిర్మించక ముందే ఈ ఆలయం కొలువై ఉన్నట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ ఆలయాన్ని 11వ శతాబ్దంలో చాళక్య రాజులు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు స్థానికులు చెప్పుకొంటున్నారు. గోవిందరాజ స్వామిని జైనులు తమ ఆరాధ్య దైవంగా పూజించేవారని, ఏడాది పొడవున జరిగే పూజలతో ఈ ఆలయం నిత్యం కళకళలాడుతూ ఉండేదంటున్నారు.

### భక్తుల సౌకర్యార్థం..

కొండపై స్వయంభుగా వెలసిన గోవిందరాజస్వామిని దర్శించుకోవాలంటే మెట్ల మార్గంలో గుట్ట ఎక్కాల్సి ఉంటుంది. అయితే గుట్టను ఎక్కలేని వృద్ధులు, ఇతర భక్తులకు కూడా స్వామి దర్శనం చేయించాలన్న లక్ష్యంతో గోవిందరాజుల గుట్టకు కూతవేటు దూరంలోనే శ్రీ గోవింద లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఇందులో కొలువై ఉన్న లక్ష్మీనారాయణ స్వామితో పాటు గణపతి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తూ కోరిన కోర్కెలు తీర్చుతారంటూ నమ్మకం.

### పవర్ కట్..

అయితే పురాతన ఆలయమైన శ్రీ గోవింద లక్ష్మీనారాయణ ఆలయంపై పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అటువైపు దేవాదాయ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడక పోవడంతో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. గత మూడు సంవత్సరాలుగా కరెంట్ సరఫరా లేకపోవడంతో స్వామి వారు చిమ్మ చీకటిలోనే శయనిస్తున్నారు. ఆలయానికి ప్రత్యేక మీటర్ ఉన్నప్పటికీ కరెంట్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు లైన్ కట్ చేసి పోయారు. దీంతో చీకటి పడిందంటే చాలు ఆలయ ప్రాంగణమంతా చిమ్మ చీకటిలోనే ఉంటుంది. ఆలయ ప్రాంగణంలో ఉన్న అనుబంధ నిర్మాణాలు పూర్తిగా కూలిపోయాయి. ప్రధాన రహదారికంటే ఆలయ ప్రాంగణం కిందికి ఉండడంతో వర్షం వచ్చిందంటే చాలు నీరు నిలిచి కొంత భాగం ముంపుకు గురవుతోంది.

### పాలకుల నిర్లక్ష్యం..

పాలకులు, దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో శ్రీ గోవింద లక్ష్మీనారాయణ స్వామి ఆలయం అభివృద్ధికి నోచుకోవడం లేదు. అయితే చరిత్ర ప్రసిద్ధి గాంచిన గోవింద రాజుల స్వామి వారి విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఈ ఆలయ ప్రాంగణంలోనే భద్రపరిచినట్లు స్థానికులు చెప్పుకొంటున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పు నియోజకవర్గానికే ప్రాతినధ్యం వహిస్తున్నందున ఆమె పాలనలోనైనా ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



# బ్యాలెట్ ఓటింగ్ పిల్ కొట్టేసిన సుప్రీంకోర్టు

## ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలోని చట్ట సభలకు జరిగే ఎన్నికల్లో ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ ఓటింగ్ ప్రవేశ పెట్టాలని సుప్రీం కోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ పిల్ ను కొట్టి వేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, పీబీ.వరాలే తీర్పు నిచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజికల్ బ్యాలెట్ ఓటింగ్ కావాలని సుప్రీంకోర్టులో మత ప్రచారకుడు డాక్టర్ కేఏ.పాల్ వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ ను విచారించిన న్యాయస్థానం, ఎన్నికలలో ఓటమి చెందిన వారు బ్యాలెట్ ఓటింగ్ నే తప్పుపట్టడం మంచిది కాదన్నారు. ఎన్నికల్లో గెలిచినపుడు ఉండని ఫిర్యాదులు ఓడిపోతే మాత్రం ఈవీఎంలను టార్గెట్ చేయడం సరికాదని జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య పేర్కొన్నారు.

# మాదకద్రవ్యాల నిరోధానికి కృషి

- **విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించాలి**
- **కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి సమష్టి కృషి చేసి యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత బానిస కాకుండా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా కళాశాల, పాఠశాల విద్యార్థులు, యువత మత్తుకు బానిసగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలన్నారు. వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 240 ప్రహరీ క్లబ్ ల ద్వారా విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

### చిత్తశుద్ధితో కృషి : డీసీపీ రవీందర్

జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని డీసీపీ రవీందర్ తెలిపారు. గంజాయి సాగు, వినియోగం, రవాణాకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని వ్యవసాయ, అటవీ తదితర శాఖల అధికారులను కోరారు. గంజాయి సాగు చేయొద్దని ఏఈవోలతో రైతులకు అవగాహన కల్పించాలని, సాగుచేసే వారిపై కేసులు నమోదు చేసి వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ తదితర శాఖలకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, డీఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్ స్పెక్టర్ అరవింద్ కుమార్, జిల్లా వైద్యా ఆరోగ్యాధికారి సాంబశివరావు, ఎఫ్ఆర్ఓ సందీప్, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి మురళీధరన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని శైలజ మృతికి బాధ్యత ప్రభుత్వానిదే

**➲ ఏఐఎఫ్ డీఎస్ నేత గడ్డం నాగార్జున**



**వరంగల్ వాయిస్, నారాయణఖేడ్ :** విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వానిదే బాధ్యత అని, వారి కుటుంబానికి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా కమిటీ సమావేశం బుధవారం జిల్లా కన్వీనర్ టెంకటి కుమార్ అధ్యక్షతన నారాయణఖేడ్ పట్టణంలోని గెస్ట్ హౌస్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ నిన్న కొమురం భీమ్ జిల్లా వాంకిడి మండల గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాల శైలజ మృతికి అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏఐఎఫ్ డీఎస్) రాష్ట్ర కమిటీ తరుపున సంతాపాన్ని ప్రకటించడం జరిగింది. కాంగ్రెస్ రాజ్యంలో గురుకులాలు మృత్యుకుహరాలుగా మారుతున్నాయని, ఆహారం విషతుల్యమై కొందరు, అనారోగ్యంతో ఇంకొందరు, ఆత్మహత్య చేసుకుని మరికొందరు విద్యార్థులు మరణిస్తున్నారని, పిల్లల మరణాలు తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగుల్చుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 48 మరణాలు, 23 ఆత్మహత్యలు, 8 అనుమాదాస్పద మరణాలు, 13 అనారోగ్య మృతులు, నలుగురు ఫుడ్ పాయిజన్ తో చనిపోయారని, 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, ప్రతిరోజు పేపర్లలో, వార్తలల్లో వస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, విద్యార్థుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తుందని, దానికి ఉదాహరణ వాంకిడి ప్రభుత్వ గిరిజన బాలిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని శైలజ మృతేనని, రేవంత్ రెడ్డి విద్యా శాఖను తన గుప్పిట్లో ఉంచుకొని తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. గత నెల 60 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో ఆసుపత్రుల పాలయ్యారని, అందులో కొంతమంది కోలుకోగా ప్రైవేట్ ఆస్పత్రి మంచిర్యాల్ లోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారని, అందులో ఇద్దరు విద్యార్థులు పరిస్థితి విషమించడంతో హైదరాబాదులోని నిమ్స్ కు తరలించారని, ఒక విద్యార్థి ఆరోగ్యం మెరుగుపడగా ఇంటికి పంపించారని, మరో విద్యార్థిని శైలజ మరింత క్షీణించడంతో దాదాపు 27 రోజులు పాటు నిమ్స్ లో వెంటిలేటర్ పై చికిత్సను అందించారని తెలిపారు. చివరికి శైలజ మృతదేహాన్ని అప్ప చెప్పారని, దీనికి కారణమైన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ నిధులు రూ.7800 కోట్ల బకాయిలు మూడు సంవత్సరాలుగా విడుదల చేయకపోవడంతో దాదాపు 13 లక్షల మంది విద్యార్థులు తీవ్ర మనోవేదన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ టెంకటి కుమార్, శివాజీ, శంకర్, బాలాజీ, రమేష్, శివ శంకర్, వెంకటేష్, పాల్గొన్నారు.

# మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మాలలపై జరుగుతున్న ఆసత్య ప్రచారాన్ని తిప్పికొట్టడానికి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో భాగంగా డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించ తలపెట్టిన మాలల సింహగర్జనను మాలలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా నాయకులు దుబాసి వెంకటస్వామి పిలుపునిచ్చారు. బుధవారం నడికూడ మండలం, ముస్త్యాలపల్లి గ్రామంలో దుబాసి వెంకటస్వామి ఆధ్వర్యంలో మాల మహానాడు గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ అధ్యక్షుడిగా బందెల నాగరాజు, గౌరవ అధ్యక్షులుగా బందేల దామోదర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బందేల ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా మేకమల్ల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా పొన్నగంటి బాలకృష్ణ, పైతర శ్రీనివాస్, కార్యదర్శిగా నార్ల కిరణ్, కోశాధికారిగా బందెల రాజు, యూత్ కమిటీ అధ్యక్షులుగా పసుల సిద్ధార్థ్, యూత్ కమిటీ సెక్రటరీగా పూర్ణచందర్, యూత్ కమిటీ కార్యదర్శిగా బందెల రాహుల్, ప్రచార కార్యదర్శిగా గూడెం ప్రకాష్, సోషల్ మీడియా ఇంచార్జి మేకమల్ల రాజుకుమార్, ముఖ్య సలహాదారులుగా బందెల స్వామి, మేకమల్ల కృష్ణమూర్తి, మేకమల్ల నరసింహులు, బందెల వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు.
మాల మహానాడు కమిటీ అధ్యక్షుడు బందేల నాగరాజు మాట్లాడుతూ డిసెంబర్ 1న జరిగే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటంలో భాగమైన హైదరబాద్ పరేడ్ గ్రౌండ్ లో జరిగే మాలసింహ గర్జన సభకి మాల, మాల బంధువులైన మాల ఉపకులాలు మొత్తం ఏకమై
మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేసి, మాలలపై జరిగే అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్త్యాలపల్లి గ్రామ మాలలు పాల్గొన్నారు.

# బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాలు హనుమకొండ జిల్లా బీసీ కార్పొరేషన్ డీడీ రాంరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర వచ్చిన నాటి నుంచి నేటి వరకు విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, అనేక రంగాలలో వెనుకబడి ఉన్న బీసీ, ఎంబీసీ, సంచార జాతులలో ఉన్న కులాలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని మండిపడ్డారు. బీసీ సంఘాలు, బీసీ కుల సంఘాలు పలు నిరసన కార్యక్రమాలు చేయటంతో ప్రభుత్వాలు దిగి వచ్చి బీసీ కులాల యువతీ, యువకుల జీవనోపాధికి రాష్టంలో బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటి ద్వారా సబ్సిడీ రుణాలు ఐదు వేల నుంచి రూ.లక్ష రూపాయల వరకు బీసీ బంధు పేరుతో కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న బీసీ నిరుద్యోగ యువతి, యువకులకు ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2024–2025 బడ్జెట్ లో బీసీలకు ఎనిమిది వేల కోట్లు కేటాయించడం జరిగిందని, కానీ ఇప్పటి వరకు ఈ సంవత్సరం వ్యక్తిగత రుణాలు అందించటానికి అర్హులైన బీసీ కులాలకు సబ్సిడీ రుణాలు పొందుటకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి గైడ్ లైన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్, తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నూతన కంటి ఆనందం, తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య, గంగపుత్ర సంఘం నాయకులు బర్కం రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రాకపోకలకు అంతరాయం



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** మండలంలోని ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్ కాటన్ జిన్నింగ్ మిల్ వద్ద తరచు రోడ్డు పైన వాహనాల నిలుపు జరుగుతుంది. రైతులు పత్తిని అమ్మే క్రమంలో వాహనాల్లో తరలిస్తున్నారు. అయితే కాటన్ మిల్ యాజమాన్యం నిర్లక్ష్యం మూలన ఈ వాహనాలు అన్ని రోడ్డు పైనే నిలువుతున్నారు. దీని మూలంగా ప్రయాణించే వాహనదారులకు అంతరాయం కలుగుతుంది. అంతే కాకుండా ఈ నిర్లక్ష్యంగా వాహనాలు నిలపడం వలన వచ్చి పోయే వాహనాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాబట్టి, ఈ వాహనాలు అన్ని కాటన్ మిల్ లోపలి ఆవరణలోనే నిలిపే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, వాహన దారులు కోరుతున్నారు.

# ఆర్డీఎఫ్ విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలో మండలంలోని రోల్లకల్ ఆర్డీఎఫ్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఏకంగా 5 మెడల్స్ తో పాటు, నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. డిసెంబర్ 1న మంచిర్యాలలో జరగనున్న 10 తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ లో ఎం.యశ్వంత్, ఏ.అభినయ్, ఇ.భార్గవి పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఎచ్ఎం భాషబోయిన రాములు, అసిస్టెంట్ హెచ్ఎం రమేష్, ప్రైమరీ ఇంచార్జి బాలరాజ్, పిఈటీలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# తోట అంజలి దేవికి సర్టిఫికెట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్, పూణె, మహారాష్ట్ర వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపు–2024 నవంబర్ 12 నుంచి 21 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యూనివర్సిటీ మహిళ కళాశాలలో చదువుతున్న ఏఐఎంఎల్ (సీఎస్ఎం) 3వ సంవత్సరం తోట అంజలి దేవికి సర్టిఫికేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.భిక్షాలు, ఎం.వేణుగోపాల్ రెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంకో–ఆర్డినేటర్లు టి.స్వప్న, తూర్పాటి. వెంకటేష్, వైష్ణవి, సాయి తరుణ్, సురేందర్ నాయక్, కళాశాల సూపరింటెండెంట్ వీరూనాయక్ విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మార్నేనికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రవీందర్ గౌడ్



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు జన్మదినం సందర్భంగా ఆయన స్వగృహంలో ఆత్మకూరు మాజీ పీఏసీఎస్ చైర్మన్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏరుకొండ రవీందర్ గౌడ్ కలిసి బోకే అందించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రావు ఏరుకొండ రవీందర్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బోయగాని సంపత్ కుమార్, మండల నాయకులు లస్కర్ చందర్ ఉన్నారు.

# అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని అతి పురాతనమైన ఆరు శతాబ్దాల చరిత్ర గలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో బుధవారం ఉదయం హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి వినాయకుడికి పంచామృతాలతో దేవాలయ చైర్మన్ గురు స్వామి సామల భిక్షపతి అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప స్వామి అష్టోత్తరాలతో దేవాలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో గురు స్వాములు దిడ్డి రమేష్, బొల్లపల్లి సదానందం, కొప్పుల శ్రీధర్ రెడ్డి, గట్టు కిషన్, గోరంటాల ప్రశాంత్, శ్రీకాంత్, అఖిల్ చంద్ర, భక్తులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ను కలిసిన బీఆర్ఎస్వీ నేతలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను వారి నివాసం హైదరాబాద్ నందినగర్ లో మర్యాదపూర్వకంగా కలిసి భవిష్యత్ కార్యాచరణపై కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు చర్చించారు. ఈ కార్యక్రంలో మాచర్ల శరత్ చంద్ర, కంజర్ల మనోజ్ కుమార్, బైరపాక ప్రశాంత్, ఆరూరి రంజిత్, కలకోట్ల సుమన్, గొల్లపెల్లి వీరు, ఆర్షం మధుకర్, రాకేష్ కళ్యాణ్, వినయ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టంపై భరోసా కల్పించాలి

**సాధన కమిటీ సంయుక్త కార్యదర్శి బత్తుల మహేష్ గౌడ్**



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** సమాచార హక్కుచట్టంపై ప్రభుత్వం సామాన్య ప్రజలకు భరోసా కల్పించాలని బత్తుల మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లోని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ కార్యాలయంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ కాల క్రమేణ ఆర్టీఐ యాక్ట్ చట్టం అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సమాచారాన్ని వెల్లడించని కారణంగా సక్రమంగా జరగాల్సిన పనులు అడ్డదారిలో జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అధికార యంత్రాంగంలో జవాబుదారి తనంతో ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల కాలంలో సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయా శాఖల పౌరసమాచార అధికారులతో జిల్లా కేంద్రంగా కమిషన్ కోర్టును ఏర్పాటుచేసి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కేసుల విచారణ ప్రక్రియ నిర్వహించి దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు గంగా ప్రియ రెడ్డి, లక్ష్మి ప్రియ యాదగిరి గౌడ్, వి.దయాకర్ రెడ్డి, జి.కుమార్ యాదవ్, లగ్గని శ్రీనివాస్ గౌడ్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

**◆ ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు**




**వరంగల్ వాయిస్, పరకాల :** ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రిన్సిపాల్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మరి ముఖ్యంగా పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి కూడా ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని విరివిగా ప్రచారం చేస్తున్నారని, అలాగే విద్యార్థులు చెడు సావాసాలతో మాదక ద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. టీనేజీలో విద్యార్థులు చదువు మీద దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకుని కన్న తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయవచ్చని ఎక్సైజ్ ఎస్ఐ సులోచన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ శుష్మ, మండల వైద్యాధికారి స్థానిక ఎస్ఐ, శివకృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐ సులోచన, మాదక ద్రవ్యాల నిర్మూలన కమిటీ సభ్యులు పద్మ, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సర్దార్, కళాశాల లెక్చరర్లు మాధవి, లత, రవీందర్, వీర్యా, ప్రసాద్, మహిపాల్ రెడ్డి, కృష్ణ మోహన్, సునీల్ కుమార్, రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన మంత్రి కొండా సురేఖ

**ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు**



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన భర్త కొండా మురళితో కలిసి బుధవారం సాయంత్రం తన స్వగ్రామమైన వంచనగిరిలో పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డప్పు దరువుల మధ్య గ్రామ ప్రజలతో కలిసి వచ్చి అమ్మవారికి తన స్వహస్తాలతో బోనాన్ని సమర్పించారు.





# ఆథ్లెటిక్స్ పోటీల విజేతలకు పతకాల ప్రదానం



**వరంగల్ వాయిస్, దామెర :** ఈ నెల 26న హనుమకొండ, వరంగల్ డిస్ట్రిక్ట్ లెవల్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్స్-2024 ఆధ్వర్యంలో జేఎన్ఎస్ స్టేడియంలో అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలోని ఎస్ బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర (సంగెం) పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ క్రీడల్లో విద్యార్థులు అండర్- 08, 10, 12 విభాగాల్లో పాఠశాలకు చెందిన సీహెచ్.గౌతమ్, మణిదీప్, సుశాంత్, హర్షిత్, సిద్ధార్థ, రాకేష్, వర్షిత్, నందు, వరుణ్ తేజ్, దక్షి, శ్రీవర్ధన్, ఆక్షిత్, సుజిత్, తదితర విద్యార్థులు ప్రథమ బహుమతులు-08, ద్వితీయ బహుమతులు-13, తృతీయ బహుమతులు-09, మొత్తంగా 30 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.యాదగిరి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, రేణుక, రజిత, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీకాంత్, శ్రీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని హంటర్ రోడ్డు ఎస్ఆర్ఆర్ బాయ్స్ హాస్టల్ యజమాని రవీందర్ కుమారుడు కిడ్నీ ఇన్ఫెక్షన్ వలన ఆపరేషన్ చేయడానికి డబ్బులకు ఇబ్బంది పడుతుండగా హాస్పిటల్ ఖర్చుల కోసం నగరంలోని ప్రైవేట్ హాస్టల్ సభ్యుల తరుపున బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, పొలిటికల్ వైబ్స్ టీవీ సీఈఓ పుప్పాల రజనీకాంత్ ఆధ్వర్యంలో ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందివ్వడం జరిగిందని ప్రైవేట్ హాస్టల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏరుకొండ పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏరుకొండ పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రవీందర్ హంటర్ రోడ్డులో ఒక చిన్న ప్రైవేట్ బాయ్స్ హాస్టల్ పెట్టుకొని జీవనం గడుపుతుండగా అతని కుమారునికి గతంలో కిడ్నీ ఆపరేషన్ చేయగా రూ.4 లక్షలు ఖర్చు అయ్యిందని, ఇప్పుడు మరొక ఆపరేషన్ అవసరం ఉందగా దానికి రూ.3 లక్షల ఖర్చు అవుతుందని చెప్పగా ఈ విషయం పైన స్పందించి నగరంలోని ప్రైవేట్ హాస్టల్ సభ్యుల ద్వారా రూ.90,000/- ఆర్థిక సహాయం చేశారు. అలాగే, కూడా మాజీ చైర్మన్, మాస్టర్జీ విద్య సంస్థల చైర్మన్ సంఘంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ రూ. 10,000 ఆర్థిక సహాయం చేయగా మొత్తం రూ. ఒక లక్ష రూపాయలు బాధిత కుటుంబానికి అందించామని ఏరుకొండ పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచగిరి రతన్ కుమార్, గొర్రె కృష్ణ, కురిమిళ్ల శ్రీనివాస్, కూడికండ్ల భాస్కర్, మధుసూదన్ రాజ్, మనోహర్, బోయిన చంద్రమౌళి, చిరంజీవి, మోడం కవిత, రోజా, లక్ష్మి యాదవ్, దివ్య పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగుల నిరసన

**వరంగల్ వాయిస్, హై.దరాబాద్ :** గ్రామీణ స్థాయిలో పేదలకు వైద్య సౌకర్యాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎన్ హెచ్ చ్ఎంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగిన జీతం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నర్సింహ విమర్శించారు. కోఠిలోని జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ క్యాడర్ల ఉద్యోగులతో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.నరసింహ మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుంచి ఎన్ హెచ్ఎం వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు సుప్రీమ్ కోర్టు తీర్పు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, గైడ్ లైన్స్ ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాల్సి ఉండగా 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ విధానాలను పాతాళానికి తొక్కేసిందని మండిపడ్డారు. ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించుకున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు



హెల్త్ కార్డ్స్,హెల్త్ ఇన్సూరెన్స్, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని, 7నెలల పీఆర్సీ బకాయిలు గత ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగుల బాలసుబ్రహ్మణ్యం, సరికొండ సురేష్ గౌడ్, జనగాం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, ఎన్.శ్రీనివాస్, గౌరీ, చంద్రకళ గౌసుద్దీన్, సతీష్ కుమార్, సిద్ధు, శంకర్ నాయక్, లక్ష్మి, బాలు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ అప్పయ్య ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** గ్రామ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లం అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలించి ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఓపీ పేషేంట్ లకు డైలీ బీపీ, డయాబెటీస్ టెస్ట్ లు చేయాలన్నారు. లింగ వివక్షపై ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. స్థానిక పాఠశాలలు, గ్రామ పంచాయతీలో ప్రజలను సమావేశపరిచి ఆడపిల్లలపై జరుగుతున్న సాంఘిక అసమానతలను అరికట్టాలని కోరారు. ప్రజలు వ్యాధి బారిన పడినప్పుడు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. అత్యవసర పరిస్థితులలో రాయపర్తి పీహెచ్ సీ గాని, పరకాల సివిల్ హాస్పిటల్లు గాని సందర్శించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పల్లె దావఖాన డాక్టర్ సిరికొండ అనూహ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన సీపీఎం శాఖ కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సీపీఐఎం రంగశాయిపేట ఏరియా కమిటీ పరిధిలోని శాఖ కార్యదర్శుల మహాసభలు 42వ డివిజన్ లెనిన్ నగర్ లో నిర్వహించడం జరిగింది. బుధవారం ఆర్టీవో ఆఫీస్ జంక్షన్ లోని లెనిన్ నగర్ లో జరిగిన ఈ సమావేశంలో 41వ డివిజన్, 42వ డివిజన్, 43వ డివిజన్, 44 డివిజన్లకు సంబంధించి పార్టీ శాఖల మహాసభలు నిర్వహించుకోవడం జరిగింది. ఇందులో 13 శాఖల నూతన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తదనంతరం నర్సంపేటలో జరిగే జిల్లా మహాసభలకు రంగశాయిపేట ఏరియా కమిటీ పరిధి నుంచి 15 మందిని డెలిగేట్స్ గా ఎంపిక చేసుకోవడం జరిగింది. మన్నూరు జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తాటికాయల రత్నం, ఎం.ప్రత్యూష, జి.ఓదెలు హాజరై మాట్లాడుతూ రంగశాయిపేట ఏరియా పరిధిలో దాదాపు 20 సంవత్సరాలుగా పార్టీలో పనిచేస్తూ బూర్జువా పార్టీ నాయకులు ఎన్ని అలజడులు సృష్టించిన ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన పార్టీ ఎజెండాగా మలుచుకొని జక్కలొద్దీ బెస్తన్ చెరువు భూ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించి నిత్యం ప్రజలతో సంబంధాలు పెట్టుకుని ప్రజల శ్రేయస్సు కొరకు శ్రమిస్తూ వస్తున్నామన్నారు. నూతన కార్యదర్శులుగా ఎంపికైన వారు మన్నూరు జ్యోతి, తాటికాయల రత్నం, ఏం ప్రత్యూష, జి ఓదేలు, సింగారపు దాసు లావణ్య, మైరున్నిసా, ముంతాజ్, ఉసిల శ్రీనివాస్, ఉసిల్ల దీప, మాధవి, రమేష్ శాఖ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# కేజీబీవీ సిబ్బందికి మినిమం టైం స్కేల్ పెంచాలి

## టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు




**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** కస్తూర్బా గురుకుల విద్యాలయంలో పని చేస్తున్న మహిళ ఉపాధ్యాయులకు, నాన్ టీచింగ్ సిబ్బందికి మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్ మండలం తిరుమలగిరి గ్రామంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కేజీబీవీ సిబ్బందికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో నైట్ వాచ్ మెన్ కేర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వాడుకోవద్దన్నారు. చైల్డ్ కేర్ లీవ్ లను మంజూరు చేస్తూ ప్రభుత్వం వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో అందరితో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

# గోడ పత్రికల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** ఖిలా వరంగల్ మండలం రంగశాయిపేట, శంభునిపేట జంక్షన్ లో రేపు మహాత్మా జ్యోతిరావు పూలే 134 వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం గోడ పోస్టర్లను ఆవిష్కరించారు. రేపు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా, కులాలకు అతీతంగా ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్, విద్యార్థి ఉద్యమ నేత కేయూ జేఏసీ చైర్మన్ కత్తెరపల్లి దామోదర్, తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గద్దల కుమారస్వామి, బీఆర్ఎస్, రైతు బంధు మండల అధ్యక్షులు తరగల ప్రసాద్, ఎం ట్వంటీ వన్ నాయకులు మైదం సంజీవ, నీలం సంజీవ, ట్రేడ్ యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సలీం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ సలావుద్దీన్, ఎండీ కుతుబుద్దీన్, బీ ఆర్ ఎస్ రైతుబంధు నాయకుడు తరగల ప్రసాద్, ఎండీ గౌస్, ఎండీ వలి, పోలేపాక సందీప్, తాటికాయల కృష్ణంరాజు, అర్జున్, బొట్ల రమేష్, ఐతమ్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# పర్వతోహరణకు మాలోత్ భాస్కర్



**వరంగల్ వాయిస్, ములుగు రోడ్డు :** స్థానిక లాల్ బహదూర్ కళాశాల ఎన్సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆర్మీ విభాగం నుంచి మాలోత్ భాస్కర్ నూనఘడ్ నేషనల్ ట్రెక్కింగ్ క్యాంప్ గుజరాత్ కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు తెలిపారు. ఈ క్యాంపు 28 నవంబర్ నుంచి డిసెంబర్ 8 వరకు దేశంలో ఉన్న మెరుకలు తిరిగిన ఎన్సీసీ క్యాడేట్స్ ఇచ్చే పర్వతోరాహణ క్యాంపు ఉంటుందని, వరంగల్ గ్రూప్ నుంచి ఎం భాస్కర్ ఒక్కరే ఎంపికైనందుకు సంతోషంగా ఉందన్నారు. పర్వతోహరణలో మంచి ప్రతిభ కనబరిచి కళాశాలకు, బెటాలియన్ కు, వరంగల్ కు, తెలంగాణకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎంతో క్రమశిక్షణకు మారు పేరైన భాస్కర్ కు ఈ అరుదైన అవకాశం రావడం పట్ల కళాశాలలో అందరూ సంతోషం వ్యక్తం చేశారు. గుజరాత్ కు ప్రయాణమైన భాస్కర్ ను కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ భాగ్య నారాయణ, సెక్రెటరీ ఎన్ వినయ్ కుమార్, ఎగ్జిబిషన్ సొసైటీ మెంబర్స్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ ఎం.సదానందం, ఎన్సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

# గిరిజన శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**వరంగల్ వాయిస్, కాటారం :** గిరిజన శాఖలో కాంట్రాక్టు పద్ధతిపై ఉద్యోగం చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలనీ లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్ సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు,) (బాలికలు) కాటారంలో చలో హైదరాబాద్ కర పత్రాన్ని ఆవిష్కరించారు. గత 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న వారిని గత పాలకులు మోసం చేశారని వివరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో 1804 కాంట్రాక్టు ఉపాధ్యాయులు గిరిజన సంక్షేమ గురుకులాలలో 491 కాంట్రాక్టు బోధనేతర ఉద్యోగులు, గిరిజన సహకార సంస్థలలో 94 మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పది సంవత్సరాలు, కేసీఆర్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు కాలయాపన చేసి మోసం చేశారని వివరించారు. గురుకులాల్లో పార్ట్ టైం ఉద్యోగులకు, 12 నెలల జీతాలు ఇవ్వాలని, స్లీపింగ్ శానిటేషన్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన పేర్కొన్నారు .



ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య, పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజు, వేల్పుల సంపత్, దోమ రామకృష్ణ, మంతెన శ్రీనివాస్, కృష్ణమాచారి సర్దార్ సింగ్, స్వప్న, పద్మ, రజిత, రాజశేఖర్, యాకమ్మ, రజిత, నాన్ టీచింగ్ స్టాఫ్ సారక్క, రాజేశ్వరి, పెండ్యాల సత్యనారాయణ, అల్లం మల్లయ్య, గట్టు రవీందర్, బీసుల శ్రీనివాస్, హట్కర్ రాజు, పోలం మల్లమ్మ, మాడి రాజయ్య, పొలం చిన్నయ్య, ఖమ్మం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

6
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, నవంబర్ 27, 2024

# పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలి

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## భద్రకాళి చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్లు, కమిషనర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతంగా చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రకాళి చెరువులో చేపట్టిన పూడికతీత పనులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. భద్రకాళి చెరువు పూడికతీత పనులకు సంబంధించిన వివరాలను సాగునీటిపారుదల శాఖ అధికారులను కలెక్టర్లు అడిగి తెలుసుకున్నారు. పూడికతీత పనులకు సంబంధించి సాగునీటి పారుదల, రెవెన్యూ, కుడా, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్లు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత పనులకు సంబంధించి సర్వే చేసి దేనికి ఎంత ఖర్చవుతుందనే వాస్తవ అంచనాలను తయారు చేయాలని సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పూడిక తీసిన మట్టిని డంపింగ్ చేసేందుకు స్థలాలను గుర్తించాలని ఆర్డీవోలను ఆదేశించారు. చెరువు మట్టి కావాలని దరఖాస్తు చేసుకున్న ప్రజలతో అధికారులు సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కుడా అధికారులు మూడు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తీసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించగా కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సత్యపాల్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ సీఈ అశోక్ కుమార్, ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ సీతారాం, కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజన పథకం తనిఖీ



**వరంగల్ వాయిస్, దామెర :** స్థానిక మండల తహశీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి బుధవారం ల్యాదెల్ల గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేశారు. దామెర మండలంలోని గవర్నమెంట్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలన అవగాహన సదస్సు కార్యక్రమం ఎన్ జీఓబీ జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఆర్ఐ భాస్కర్ రెడ్డి, పీహెచ్ సీ డాక్టర్ మంజుల, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాణి, మండల గిర్దావర్ సంపత్ పంచాయతీ సెక్రటరీ మనోహర్, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** పాఠశాల విద్యార్థులకు పౌష్టిక విలువలు కలిగిన చిరుధాన్యాల ఆహారం అందించాలన్న ఉద్దేశంతో రికార్డ్ మిల్లెట్ హబ్ ద్వారా "చిన్నారులకు చిరుధాన్యాలతో చిరుతిళ్లు" అనే అవగాహన కార్యక్రమాన్ని బుధవారం హనుమకొండ సుబేదారిలోని రామన్ హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రామినేని రాజేష్, డైరెక్టర్ పురుషోత్తంలు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు తల్లిదండ్రులు తప్పక విద్యార్థులకు క్రమం తప్పకుండా అలవాటు చేయాలన్నారు. రికార్డ్ సేవా సంస్థ అధ్యక్షుడు కుసుమ సురేష్ చిరుధాన్యాలను విద్యార్థులకు చూపించి వాటి ప్రాముఖ్యతను గురించి అవగాహన కల్పించారు. మిల్లెట్ కుకింగ్ ఎక్స్పర్ట్ కుసుమ కవిత చిన్నారులకు లభించే పోషక విలువలు కలిగిన స్నాక్స్ ప్రదర్శించి విద్యార్థులకు వాటి వల్ల అందే పోషక పదార్థాల గురించి వివరించారు. మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని పాఠశాలల యాజమాన్యాలు వారి పాఠశాలలలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించ తలస్తే వివరాలు కోసం 91003 73129 సంప్రదించవచ్చునని అన్నారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన మిల్లెట్స్ స్టాల్ లో స్నాక్స్ ఐటమ్ లను చిన్నారులు ఆసక్తితో చూసి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి అవగాహన వల్ల పోషక విలువలు కలిగిన మిల్లెట్స్ గురించి పూర్తి సమాచారం తెలిసిందని, తప్పకుండా చిన్నారులకు ఈ పదార్థాలను అలవాటు చేస్తామని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కే రజిత, పీటీఈ ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాలు తెలుసుకునేందుకు జిల్లావ్యాప్తంగా నియమించిన 46 మంది జిల్లా స్థాయి అధికారులు, తాసిల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలు, ప్రభుత్వ విద్యా సంస్థల్లో రెండు రోజులపాటు విస్తృతంగా తనిఖీలు చేసి అక్కడి పరిస్థితులపై అధికారులు నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించిన మేరకు తనిఖీ చేసి అధికారులు నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నివేదిక ఆధారంగా సక్రమంగా నిర్వహణ జరగని సంబంధిత సంక్షేమ వసతి గృహం, ప్రభుత్వ విద్యా సంస్థలు, పాఠశాలల బాధ్యులు, అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. అధికారులు తరచు ఆయా మండలాలలోని వసతి గృహాలను, ప్రభుత్వ విద్యా సంస్థలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో ఇంచార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, తనిఖీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు సంఘం ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ హవా



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికలలో మజ్దూర్ యూనియన్ హవా చాటుకుంటోంది. కాజీపేటలోని రైల్వే ఎలక్ట్రిక్ లోకో షెడ్ లోని ఈఎల్ఎస్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నాయిని సదానందం అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ డాక్టర్ శంకర్రావు ముఖ్య అతిథిగా హాజరై ట్రేడ్ యూనియన్ ఎన్నికల ప్రచారం చేశారు. ఈ ఎల్ఎస్ కార్మికులతో డిసెంబర్ 4, 5, 6, తేదీలలో జరిగే ట్రేడ్ యూనియన్ ఎన్నికలలో మీరు జెండా గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ కామ్రేడ్ కాల్వ శ్రీనివాస్, డివిజనల్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఖాజా బాబా, డివిజనల్ సెక్రెటరీ కామ్రేడ్ పిల్లలమర్రి రవీందర్, సీసీఎస్ ఎండీ కామ్రేడ్ చిల్కు స్వామి, సీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డివిజనల్ ట్రెజరర్ నరసింహారెడ్డి, ఏడీఎస్ మేడం నాగమణి, ఈఎల్ఎస్ బ్రాంచ్ చైర్మన్ ఎండీ ఇబ్రహీం, సెక్రటరీ నాయని సదానందం, కాజీపేటలోని అన్ని బ్రాంచీల చైర్మన్ సెక్రటరీలు, ఆఫీస్ బేరర్స్, వర్కింగ్ కమిటీ మెంబర్స్, యూత్ కమిటీ మెంబర్స్, ఉమెన్ కమిటీ మెంబర్స్, సూపర్ వైజర్స్, కార్మికులు, మహిళా కార్మికులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



### మజ్దూర్ యూనియన్ లో చేరిక ..

ఎలక్ట్రిక్ లోకో షెడ్ కాజీపేటలో ఎంప్లాయిస్ సంగ్ నుండి మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ డాక్టర్ శంకర్రావు, జోనల్ ప్రెసిడెంట్ కామ్రేడ్ కాల్వ శ్రీనివాస్, డివిజనల్ ప్రెసిడెంట్ కామ్రేడ్ కాజాబాబ, డివిజనల్ సెక్రెటరీ రవీందర్, బ్రాంచ్ సెక్రటరీ సదానందం, చైర్మన్ ఇబ్రహీంల సమక్షంలో మజ్దూర్ యూనియన్ నిర్వహించే కార్యకలాపాలకు ఆకర్షితులై, కార్మికులకు వెన్ను దండుగా ఉండే మజ్దూర్ యూనియన్ లో మేము సైతం అంటూ ఈఎల్ఎస్ ఎంప్లాయిస్ సంగ్ నుంచి మజ్దూర్ యూనియన్ లో చేరారు. చేరిన వారిలో మహేష్ ఎక్స్ వైస్ చైర్మన్, పంగ రవి ఎక్స్ అసిస్టెంట్ సెక్రటరీ, మోతిలాల్ ఎక్స్ వైస్ చైర్మన్, స్వర్ణ కుమారి ఎక్స్ ట్రెజరర్, ఆక్టివ్ మెంబర్స్ వి.ప్రభాకర్, ఎన్.మనోహర్, వి.రమేష్, వి.రవీందర్, బొబ్బూరి శ్రీధర్, లాలి రాజ్ కుమార్, ఎన్.రమేష్, కే.రాజు, పద్మ, తదితరులు ఉన్నారు.

# నాకింకా ఏం తెలియదు..





### హాయ్.. నేను రానా దగ్గుబాటిలో సందడి చేసిన శ్రీలీల, జొన్నల గడ్డ


టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గు బాటి కాంపౌండ్ నుంచి వస్తోన్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. హాయ్.. నేను రానా దగ్గుబాటి.. అవును ఇది ఒక షో. కానీ మీరంతా ఈ షో దేని గురించి ఆశ్చర్యపోతున్నారు. నాకింకా ఏం తెలియదు.. అంటూ రానా షేర్ చేసిన ఇంట్రో వీడియో ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా సెకండ్ ఎపిసోడ్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ ఎపిసోడ్‌లో సిద్ధు జొన్నలగడ్డ, శ్రీలీల సందడి చేశారు. డీజె టిల్లు స్టైల్‌లో సిద్ధు, శ్రీలీల మధ్య వచ్చే ప్రోమో ఫన్‌గా సాగుతూ క్యూరియాసిటీ పెంచుతోంది. సరదా చిట్ చాట్, ఆటపాటలతో ఎపిసోడ్ ఉండబోతున్నట్టు ప్రోమో హింట్ ఇచ్చేస్తుంది.ఫుల్ ఎపిసోడ్ శనివారం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఫస్ట్ ఎపిసోడ్‌లో నాని, తేజ సజ్జా, ప్రియాంకా అరుళ్ మోహన్ గెస్టులుగా హాజరయ్యారు. టాక్ షో నెక్స్ట్ ఎపిసోడ్స్‌లో నాగచైతన్య, ఎస్ఎస్ రాజమౌళి, దుల్కర్ సల్మాన్, రాంగోపాల్ వర్మ, మీనాక్షి చౌదరి, రిషబ్ శెట్టి లాంటి స్టార్ సెలబ్రిటీలతో సందడిగా సాగనుంది.



## అక్కినేని చిన్నకోడలు జైనబ్



యువ హీరో అక్కినేని అఖిల్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఆయన నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగింది. ఈ విషయాన్ని అఖిల్ తండ్రి, అగ్ర నటుడు నాగార్జున మంగళవారం తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. అయితే, ప్రస్తుతం అక్కినేని ఇంటికి కాబోయే కోడలు జైనబ్ గురించి తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఆమె ఎవరు..? బ్యాగ్రౌండ్ ఏంటి..? అంటూ నెటిజన్లు, అక్కినేని అభిమానులు తెగ సెర్చ్ చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గురించి ఆసక్తికర విషయాలు మీకోసం.. సోషల్ మీడియా కథనాలు, టాలీవుడ్ సర్కిల్ నుంచి అందిన సమాచారం ప్రకారం.. 27 ఏళ్ల జైనబ్‌కు చాలా పెద్ద బ్యాగ్రౌండే ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో పుట్టిన జైనబ్ రవ్జీ ముంబైలో స్థిరపడినట్లు సమాచారం. ఆమెకు చిత్రకారిణి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి పేరుంది. మన దేశంలోనే కాకుండా దుబాయ్, లండన్‌లోనూ ప్రదర్శనలిచ్చినట్లు తెలిసింది. అంతేకాదు.. ఎంఎఫ్ హుస్సేన్ దర్శకత్వంలో 'మీనాక్షి: ఎ టేల్ ఆఫ్ థ్రీ సిటీస్' సినిమాలో కూడా జైనబ్ రవ్జీ యాక్ట్ చేశారు. పెయింటర్‌గా మంచి పేరున్నా.. జైనబ్ రవ్జీ చాలా లో–ప్రొఫైల్ మెయిన్‌టెయిన్ చేస్తుంటారు. ఇక ఆమె తండ్రి జుల్ఫీ రవ్జీ రియల్ ఎస్టేట్ టైకూన్. ఈ రంగంలో ఆయనకు 30 ఏళ్ల అనుభవం ఉంది. అంతేకాదు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్య సలహాదారునిగా పనిచేశారు. అఖిల్‌తో జైనబ్ ఎంగేజ్మెంట్ వేళ.. జుల్ఫీ రవ్జీని నవంబర్ 13, 2019న ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తూ జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఇప్పుడు వైరల్‌గా మారింది. జుల్ఫీ రైవ్జీ కుటుంబానికి వేల కోట్ల ఆస్తులున్నాయి. తెలుగు సినిమా ఇండస్ట్రీలో అక్కినేని కుటుంబానికి ఎంత పేరు ప్రఖ్యాతలున్నాయో.. గల్ఫ్ దేశాల్లో రియల్ ఎస్టేట్ రంగంలో జుల్ఫీ రవ్జీకి అంత పేరుంది. ఇక నాగార్జున, జుల్ఫీ రవ్జీకి కొన్నేళ్లుగా స్నేహ బంధం కూడా ఉన్నట్లు తెలిసింది. ఆ స్నేహానికి తోడు అఖిల్–జైనబ్ మధ్య ప్రేమ ఈ రెండు కుటుంబాలను మరింత దగ్గర చేయబోతోంది.



# ఎవరూ తగ్గడం లేదు

### డాక్యుమెంటరీపై కోర్టును ఆశ్రయించిన ధనుష్... నయన దంపతులపై దావా



లేడీ సూపర్ స్టార్ నయనతార.. తమిళ స్టార్ ధనుష్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న నయన్ డాక్యుమెంటరీ విషయంలో ధనుష్ వెనక్కి తగ్గడం లేదు. ఈ డాక్యుమెంటరీలో తన అనుమతి లేకుండా 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారంటూ రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ ఇప్పటికే డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంపై ధనుష్ కోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా నేను రౌడీనే సినిమా విజువల్స్‌ను వాడుకున్నారని ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ మద్రాస్ హైకోర్టులో దావా వేసింది. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై కూడా దావా వేసింది. ధనుష్ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. విచారణకు అంగీకరించింది.

కాగా, నయన్.. ధనుష్ మధ్య గతకొంత కాలంగా వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. నయనతార పెళ్లితో పాటు ఆమె జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారు. ఆ క్లిప్పింగ్‌ను డాక్యుమెంటరీలో వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో రూ.10కోట్ల పరిహారం ఇవ్వాలని ధనుష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నయనతారకు లీగల్ నోటీసులు కూడా పంపారు. ఈ క్రమంలోనే ధనుష్‌ని లక్ష్యంగా చేసుకొని నయనతార ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. చట్టపరంగా తేల్చుకుంటానని తేల్చి చెప్పింది. ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళ చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే ధనుష్ కోర్టును ఆశ్రయించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# నా కెరీర్‌లో ఎక్కువ కష్టపడ్డది అప్పుడే..

తమిళ బ్యూటీ త్రిష కృష్ణన్ వర్షం సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన ఈ చిత్రం 2004లో వచ్చి మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా త్రిషకు ఉత్తమ నటిగా ఫిలిం ఫేర్ అవార్డు తెచ్చిపెట్టింది. అయితే తన కెరీర్‌లో ఇప్పటివరకు అత్యంత కష్టపడిన సినిమా అంటే వర్షం సినిమానే అని చెప్పుకొచ్చింది ఈ భామ. రీసెంట్‌గా ఒక తమిళ అవార్డుల వేడుకలో పాల్గొన్న త్రిష కృష్ణన్ తన అమ్మ ఉమ కృష్ణన్‌తో హాజరైంది. అయితే అవార్డు తీసుకోవడానికి వేదికపైకి త్రిష వెళ్లగా.. యాంకర్ త్రిష అమ్మను అడుగుతూ.. త్రిష కృష్ణన్ తన కెరీర్‌లో ఏ సినిమాకు అత్యంత కష్టపడిరదని అడుగుతుంది. దీనికి ఉమ కృష్ణన్ మాట్లాడుతూ.. త్రిష కెరీర్‌లో చాలా కష్టపడిన చిత్రం వర్షం. ఈ సినిమా కోసం 45 రోజులు వర్షంలోనే గడిపాం. ఇదంత చూసి ఈ సినిమా మానేసి చెన్నైకి వెళదాం అనుకున్నాం. కానీ ధైర్యంతో ముందుకు నడిచాం. ఈ సినిమా విడుదలయ్యాక మా కష్టం అంతా మర్చిపోయం. సినిమా చాలా పెద్ద హిట్ అయ్యింది. అని చెప్పగానే.. త్రిష కూడా అవును వర్షం సినిమాకే నేను చాలా కష్టపడ్డాను అంటూ చెప్పుకొచ్చింది.



# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి అప్పుడే ప్రభుత్వాలకు మనుగడ






- ఓయూ సోషల్ సైన్స్ మాజీ డీన్ కె.శ్రీనివాసులు
- రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేయూలో జాతీయ సదస్సు

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే ప్రభుత్వాలకు మనగడ ఉంటుందని ఉస్మానియా యూనివర్సిటీ సోషల్ సైన్స్ మాజీ డీన్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు అన్నారు. ప్రజలకిచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే సంక్షేమ అభివృద్ధి సాధ్యమని, తద్వారా దేశంలో, రాష్ట్రంలో సుస్థిరపాలన నెలకొంటుందన్నారు. బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్ లో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు, వాగ్దానాలు, రాజకీయ పనితీరు' అనే అంశంపై రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య అధ్యక్షతన తీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అణగారిన ప్రజలను జీవితాంతం ఆర్థికంగా, ఆత్మ గౌరవంతో జీవించేలా చేసేవే నిజమైన సంక్షేమ పథకాలన్నారు. కులం, మతం, ఓట్లు, సీట్లు రాజకీయ అధికార ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వాలు పథకాలు తెస్తే పాలకులే సమాజాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టినట్టవుతుందన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక, ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చలేక పోయిందన్నారు. ప్రలోభ పూరిత వాగ్దానాలు, మాటలతో పాలన కొనసాగించడంతో అధికార పీఠం కోల్పోయిందన్నారు. 2014 నుంచి 2023 వరకు తెలంగాణ విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందని, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి, నాణ్యమైన పరిశోధనలకు సరిపడా నిధులు కేటాయించక పోవటం, ఖాళీగా ఉన్న అధ్యాపక ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నేడు విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఉద్యమాలకు పురిటిగడ్డ..:

**- రిటైర్డ్ ప్రొఫెసర్ అడప సత్యనారాయణ**

ఎన్నో చారిత్రాత్మక సామాజిక, ప్రజా స్వామిక, సాంస్కృతికోద్యమాలకు తెలంగాణ ప్రాంతం పురిటి గడ్డ అని ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ అడప సత్యనారాయణ అన్నారు. ఈ మట్టిలో పుట్టిన ప్రతిబిడ్డ దిక్కారస్వరానికి, చైతన్యానికి ప్రతిక అన్నారు. నేటితరం విద్యార్థులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వస్తున్న మార్పులను శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకొని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. నేటికీ దేశంలో, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి కుల, మతాలను ఉపయోగించుకోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరిస్తే ప్రజలే ప్రభుత్వాలను విస్మరిస్తారనే విషయాన్ని అధికార రాజకీయ పార్టీలు గ్రహించాలన్నారు. డాక్టర్ ఎ.హరిప్రసాద్, ప్రొఫెసర్ టి.మనోహర్, ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున రెడ్డి, ప్రొఫెసర్ వి.రామచంద్రం ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు, ప్యానల్స్ స్పీకర్లకు మధ్య ప్రశ్నలతో కూడిన సమాధానాల చర్చ కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వి.సత్యనారాయణ, డాక్టర్ వి.నాగరాజు, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ విజయ్, డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ టి.సంజీవ్ లతో పాటు రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సురేఖ



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు జగదీశ్వర్ రెడ్డి–రజిత దంపతుల కూతురు రుత్విక రెడ్డి, అభిజిత్ రెడ్డిల వివాహ మహోత్సవానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. బుధవారం శంషాబాద్ లోని జీఎంఆర్ అరీనా కళ్యాణ వేదికగా జరిగిన ఈ వివాహ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి సురేఖ హాజరయ్యారు. వధూవరులకు పుష్పగుచ్ఛాన్ని అందించి, శుభాకాంక్షలు తెలిపి వారిని నిండు మనసుతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు హాజరైన పలువురు మంత్రి సురేఖతో సెల్ఫీలు దిగి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



## పక్కాగా సర్వే సమాచార నమోదు

**బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పక్కాగా సర్వే సమాచార నమోదు జరగాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా సమావేశ మందిరంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా నమోదు తీరును కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తమ సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమాచారంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా జరగడానికి ఎన్యుమరేటర్లు ఆపరేటర్లు కలిసి సంయుక్తంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్వో షహజాది బేగం, టీఎంసీ రమేష్, ఐటీ మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.



## మామునూరు పోలీస్ స్టేషన్ లో అఘోరీపై కేసు

**కోడిని బలి ఇవ్వడంపై యువకుల ఫిర్యాదు**

**వరంగల్ వాయిస్, క్రైం :** అఘోరి నాగసాధుపై మామునూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఈ నెల 19న బెస్తం చెరువు శ్మశాన వాటికలో నాగసాధు ఒక కోడిని బలి ఇవ్వడంపై కొందరు యువకులు జీవహింస చట్టం కింద మామునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు అఘోరి నాగసాధుపై పోలీసులు కేసు నమోదు చేసి పలు సెక్షన్ ద్వారా విచారణ చేస్తున్నారు. బెస్తం చెరువు శ్మశాన వాటికలో అఘోరి రాత్రి పొద్దుపోయే వరకు హల్ చల్ చేసిన విషయం విధితమే. అఘోరీని చూసేందుకు జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అమె వద్ద అతీంద్ర శక్తులు ఉన్నాయని నమ్మిన జనం శ్మశానంలోనే ఆమెతో బొట్టు పెట్టించుకున్నారు. ఆమె ఆశీర్వచనాలు పొందారు.

# ఘనంగా పోతన జయంతి ఉత్సవాలు

- ఏవీవీ విద్యా సంస్థలో ఏర్పాట్లు
- ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మిక వేత్త సూర్యనారాయణ మూర్తి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పోతన జయంతి ఉత్సవాలను బుధవారం నగరంలోని ఏవీవీ విద్యాసంస్థల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అతిథులను సౌజన్య వేదికపైకి ఆహ్వానించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఏవీవీ సంఘ సభ్యులు ప్రొఫెసర్ ఎస్ఎస్ విఎన్ శర్మ మాట్లాడుతూ తాను చిన్న తనంలో ఈ పవిత్ర ప్రాంగణంలో చదువుకున్న పోతన పద్యాలను నెమరువేస్తూ పిల్లలను పద్యపఠనం వైపు మల్లించారు. పోతన జయంతి ప్రాశస్త్యాన్ని ఏవీవీ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు గందె శ్రీనివాస్ సభికులకు సవివరంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మావుడూరు సూర్యనారాయణ మూర్తిని తెలుగు ఉపాధ్యాయురాలు రమాదేవి సభకు పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోతన భక్తితత్వాన్ని వివరిస్తూ బాల్యక్రీడలను నలకూబర సుగ్రీవుల వృత్తాంతాన్ని వివరించారు. తన చక్కటి కథాగమన పద్యసంపుటిని వివరిస్తూ పోతనను ఒక ప్రక్క శ్రీకృష్ణున్ని ఒక ప్రక్క పిల్లల హృదయాలలో నిలుపుతూ కల్ల ముందు శ్రీకృష్ణుని చూసిన మాధుర్యమును పిల్లలకు కలిగిస్తూ భక్తా పారవశ్యంలో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్




భుజేందర్ రెడ్డి మాట్లాడుతూ యావత్ భారతావనిలో ఎక్కడా నిర్వహించని పోతన జయంతి కార్యక్రమాన్ని ఈ విద్యా సంస్థ వ్యవస్థాపకులైన ఆచార్య చందా కాంతయ్య శ్రేష్ఠి గత 70 సంవత్సరాల క్రితం ప్రారంభించగా వారి తదనంతరం ప్రతీ సంవత్సరం ఈ విద్యా సంస్థలు అత్యంత వైభవంగా జరుపుకునే వ్యవస్థాపక దినోత్సవంతో పాటు పోతన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం వరంగల్ జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన భాగవత పద్యపఠన పోటీల్లో దాదాపు 2,000 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో అత్యుత్తమ పద్యపఠనం చేసిన 100 మంది విద్యార్థులకు అతిథులచే బహుమతి ప్రదానం చేశారు. సంజీవ వందన సమర్పణతో కార్యక్రమాలు ముగిసాయి. కార్యక్రమంలో ఏవీవీ సంఘ యాజమాన్యం, విద్యా సంస్థల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com